# అనగనగా... ఒక కథ

సూరిబాబుకారోజు తండ్రిమీద చాలా కోపంగా వుంది.తనే పెద్దవాడైతే పటపటా వాయించేసేవాణ్ణి అనుకున్నాడు. పళ్లు పటపటా కొరుక్కున్నాడు.

**ఏడో తరగతి ఆఫ్ట్రాల్...క్లాసు టెస్టులో ...తెలుగులో ముప్ఫై మార్కులు వచ్చినందుకు టీచరు బల్లమీద నించో పెట్టి, తిట్టి...క్లాసులో పిల్లలందరినీ నవ్వించింది- వెంటనే చచ్చిపోవాలనిపించింది.**

ఇంటికొచ్చాక నాన్న మరీ రెచ్చిపోయాడు- "మాతృభాష కూడా రాని వెధవకి..నాలుగు పూటలు అన్నం పెట్టకుండా మాడ్చిపడెయ్" అని తల్లికి ఆర్డరేశాడు.

'మాడ్చిపడేయక్కర్లేదు. నేనే తినను ఫో' అనుకున్నాడు.

# సారీ...నాన్నా...!!

"స్కూలు నుంచి రాగానే రయ్యిన..ఆటలకి పరిగెట్టి చీకటడ్డాక ఇంటికి తగలడ్డాలు-దున్నపోతులా మెక్కి, మంచిమెక్కి గురకలు పెట్టడాలు-బారెడు పొద్దెక్కేక లేవడాలు..ఇలా అయితే ఈ వెధవకి పెద్ద పరిక్షలు నాటికి గుండు సున్నాయే మార్కు వస్తుంది!"

"నువ్వలాగే శపిస్తే అలాగే అవుతుంది" ఉక్రోషంగా అన్నాడు సూరి.

"వెధవ..ఎగ్స్ట్రా మాట్లాడుతున్నావ్. అయ్యో నాన్నా కష్టపడి చదువుతాను...మంచి మార్కులు తెచ్చుకుంటాను..అని చెప్పిచావచ్చుగా" మళ్ళీ గయ్యిమన్నాడు.

సూరిబాబు కళ్లలో నీళ్లు రాలేదు. ఎర్రటి రక్తం జీరలు కళ్లలో పొంగాయి..ముఖం కందగడ్డలా అయింది. జేబులో దాచుకున్న అరచేతుల్లో పిడికిళ్లు నలుగుతున్నాయి.

"కనీసం సిగ్గు పడట్లేదు. పశ్చాత్తాపం లేదు" అంటూ దండకం కొనసాగించాడు.

"అబ్బబ్బబ్బ..ఆపండీ-మీరెన్ని తిట్టినా ఇప్పుడా పేపరు వెనక్కి తెచ్చుకుని, తిరగరాసి ఇవ్వలేడుగా..ఎందుకా కంఠశోష" తల్లి బ్రేకు వేసింది.

"నువ్వు నోర్ముయ్..నీ ప్రేమవల్లే వాడిలా తయారయ్యాడు. రేపు పెద్దయ్యాక రిక్షా తొక్కుకుని బతికించాలి..బలంగా మేపు గాడిదని" అన్నాడు కుటుంబరావు.

"మేపుదాం రిక్షా తొక్కటానికైనా ఓపిక ఉండాలిగా! ఈ తిట్లు తిట్టటానికి విని యోగిస్తున్న టైముని కాస్త వాడిని దగ్గర కూచోపెట్టుకొని చదువు చెప్పడానికి వినియోగిస్తే అందరికీ మనశ్శాంతిగా వుండేది"

"చదువుకున్న దాన్ని పెళ్లి చేసుకునుంటే..ఇంకా మనశ్శాంతి ఉండేది" అక్కసు తీర్చుకున్నాడు కుటుంబరావు.

"నేను చదువుకునే ఉంటే రైసుమిల్లు గుమాస్తా సంబంధం చేసేవాడా మా నాన్నా?" ఓ విసురు విసిరివెళ్లింది కాంతాలు.

నేలమీద కాలుకొట్టి విసురుగా బైటకెళ్లాడు కుటుంబరావు.

సూరిబాబు మంచం మీద బోర్లాపడ్డాడు. లోపల తల్లి తన బదులు ఏడుస్తోంది. సూరిబాబుకి పొద్దున్నించీ జరిగిన అవమానాలూ తిన్నతిట్లూ అన్నీ గుర్తుకొస్తున్నాయి. నిద్రలో కలో..మెదడులో ఆలోచనో తెలియని జరగబోయే పర్యవసానాల్ని ఊహిస్తున్నాడు.

తనింక స్కూలు కెళ్లడు-

అసలు ఇంట్లోంచే పారిపోతాడు-

వెళ్లివెళ్ళి బిక్కవోలు రైల్వేస్టేషన్ కెళ్తాడు-

టిక్కెట్టు డబ్బులు లేవు- రైలు కింద తలెట్టి చచ్చిపోవాలనుకుంటాడు.

కానీ రైలు కదల్దు.

రైల్లో బొగ్గులేసే కూలీలు రాలేదు.

'ఛీ' అనుకుని బైటకొచ్చాడు.

బైట 10 రిక్షాలు ఉన్నాయి.

ఒక రిక్షా ఎక్కి తొక్కుకుంటూ...తొక్కుకుంటూ..కుంటూ..టూ. పెద్దవాడయ్యాడు-

ఓరోజు కుటుంబరావు "ఏయ్ రిక్షా" అని పిలిచాడు. సూరిబాబు తండ్రిని గుర్తుపట్టాడు. ఆయన రూపం ఏం మారలేదు. తనే పెద్దాడైపోయాడు..అందుకని ఆయన వీణ్ని గుర్తుపట్టలేదు.

ఆయన చెప్పిన చోటుకి తీసుకువెళ్లడానికి వప్పుకున్నాడు.

రిక్షా వేగంగా తోల్తున్నాడు..

ఎదురుగుండా లారీ వస్తోంది.

దానికెదురుగా రిక్షా ఇంకా వేగంగా తొక్కి తను దూకేసి, బైటకి గెంతాడు-లారీ రిక్షానీ నాన్ననీ కలిపి నవిలేసింది.

సూరిబాబు నవ్వట్లేదు..ఎందుకంటే..అమ్మ ఏడుస్తోంది-

సూరిబాబు కోపంగా ఉన్నాడు-

అమ్మ ఏడపుమాత్రం వినిపిస్తోంది..ఉలిక్కిపడి లేచాడు.

"నువ్వా..ఆయన చెప్పిన మాట వినవ్..ఎక్కడైనా ప్రైవేటుకి పెట్టించమంటే ఆయన వినిపించుకోడు- మీ అయ్యా కొడుకుల మధ్య నేను చస్తున్నాను" అమ్మ నిజంగా ఏడుస్తోంది- "రా! ఆయనొచ్చేలోగా కొంత అన్నం తినేసి, గడగడా ఓ గంట చదువుకో-"

"నేను అన్నం తినను-మాడ్చి చంపమన్నాడుగా నీ మొగుడు అలాగే చస్తాను"

"చావటం అంత సులభమూ కాదు..సుఖమూ కాదు. నా చిన్నప్పుణ్ణుంచీ నేను

**"చావటం అంత సులభమూ కాదు..సుఖమూ కాదు. నా చిన్నప్పుణ్ణుంచీ నేను 100సార్లు చద్దామనుకున్నాను. చచ్చేవరకూ చచ్చినట్లు బతకాల్సిందే..రా!"**

100సార్లు చద్దామనుకున్నాను. చచ్చేవరకూ చచ్చినట్లు బతకాల్సిందే..రా!''

''రాను..వద్దు..''

''పోనీ..కొంచెం మజ్జిగ అన్నం కలిపి ఇస్తాను''

''అక్కర్లేదు''

కాంతాలు ఏడిచింది.

ఇప్పుడు మొదటిసారి ఏడుపు శృతి చేస్తున్నట్లైంది సూరి గొంతు. ''నువ్ నా కోసం ఏడవక్కర్లేదు'' అన్నాడు.

కళ్లలో నీళ్ల తడి కూడా చేరింది.

సూరి ఆ రాత్రి అన్నం తినలేదు. దుప్పటిలో దాచుకున్న ముఖానికి, నిద్రని కప్పుకున్న నీరసం తోడొచ్చింది!

తెల్లవారింది..సూరిబాబుకి.

వాళ్లమ్మకి రాత్రే గడవలేదు. ఆ రాత్రి ఆలస్యంగా వచ్చిన మొగుడికి అన్నం పెట్టినా...తను అభోజనంగా పడుకుంది.

కొడుకు అన్నం తినకుండా ఎప్పుడైనా నిద్రపోతే...వాడిని లేపి తినిపించే, కుటుంబరావు ఇప్పటికీ పంతంగానే ఉన్నాడు-

హాయిగా నిద్రపోయాడు.

తండ్రి లేవకుండానే నిద్రలేచిన సూరిబాబు చకచకా స్నానం చేసి గబగబా బైటకి వెళ్లబోతుంటే తల్లి..'పాలైనా తాగి వెళ్ల'మని బతిమాలింది-



మాట్లాడకుండా వెళ్లిపోయాడు స్కూలు సంచి భుజాన వేసుకుని.

వాడలా వెళ్లగానే తండ్రి గురక ఆపి, ముసుగు తీసాడు-

కన్నీళ్లతో కాంతాలు ఏదో చెప్పబోయింది-

''పంతానికి ఏం తక్కువలేదు'' అనుకుంటూ మంచం దిగాడు.

అతని మాటలో నిన్నటంత కోపం లేదు-

కొంతలో కొంత ఊరట పొందింది కాంతాలు.

* * *

లంచ్ బెల్లు కొట్టగానే క్లాస్‌టీచర్ సూరిబాబుని స్టాఫ్ రూమ్‌లోకి కబురుపెట్టింది-

ఆకలిగా వుంది..నీరసంగా వుంది..అయినా టీచర్ రమ్మంది వెళ్లి ఆమె ఎదురుగా నిలబడ్డాడు.

''లంచ్ బాక్స్ తెచ్చుకున్నావా?''

''లేదు మేడమ్''

''ఇంటికెళ్తున్నావా?''

''అహ..ఫణి దగ్గర తెలుగు నోట్స్ రాసుకుని..''

''చూడూ...ఆకలిగా వున్నప్పుడు చదువు బుర్రకెక్కదు..మనిద్దరం కల్సి టిఫెన్ చేస్తూ తెలుగు సబ్జెక్ట్ గురించి మాట్లాడుకుందాం..నేను నీకు అర్ధమయ్యేలా చెప్తా''

''బట్ మేడమ్..నేనింటికెళ్లి...''

''ఇంటికెళ్లద్దుగానీ..ఓ పన్చేయ్..ఈ పది రూపాయలు తీసుకుని మనిద్దరికీ రెండు పెసరట్టు ఉప్మా పట్రా''

''పెసరట్టు ఉప్మా నీకు నచ్చుతుందా..నచ్చుతుంది కదూ..''

నోట్లో నీళ్లూరుతుంటే తల ఊపాడు.

''వెరీగుడ్..త్వరగారా!'' ఆర్డరేసింది టీచర్.

పరుగెట్టాడు..సూరిబాబు.

* * *

టిఫెన్ తినడం అయింది.

కొంతసేపు తెలుగుపాఠాలు చెప్పింది టీచర్..

స్కూల్ బెల్ మోగింది.

వెళ్లడానికి ప్రిపేరవుతూ..''థేంక్యూ టీచర్'' సిన్సియర్‌గా అన్నాడు సూరిబాబు.

''చూడు సూరిబాబూ..నువ్ థేంక్స్ చెప్పాల్సింది నాకు కాదు..నేను కూడా మీ నాన్నకి థేంక్స్ చెప్పాలి?!''

సూరిబాబు అర్ధం కానట్లు చూశాడు.

''నువ్వు రాత్రి అన్నం తినలేదని, పొద్దున పాలు కూడా తాగకుండా వచ్చావని మీ నాన్నగారు వచ్చి కళ్లనీళ్లు పెట్టుకుని చెప్పారు. ఆయనే 10 రూపాయలిచ్చి నీకు పెసరట్టు ఉప్మా ఇష్టం అనీ..అది తినిపించమనీ చెప్పారు. నీతో ఈ విషయం చెప్పద్దని చెప్పారు. నేనైనా ఆయనేనా..కోప్పడేది...''

సూరిబాబుకి కళ్లనీళ్లు తిరిగాయి. ఇంకేం వినకుండా దోసిళ్లో మొహం దాచుకుని వెనక్కి వెళ్లిపోయాడు. టీచర్ నవ్వుకుంది.

*